క్లుప్తంగా

నిమ్మతోటల పరిశీలన



పొదలకూరు : మండలంలోని దుగ్గుంటరాజు పాళెంలో ఉపాధి హామీ పథకం కింద సాగుచేసిన నిమ్మతోటలను ప్లాంటేషన్ డిప్యూటీ కమిషనర్ ఎం అశోక్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. మొక్కల పెంపకం వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఉపాధి ఏపీడీలు శ్రీహరిరెడ్డి, మృదుల, సూపర్‌వైజర్ దయాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర



తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన గోవిందమాల ధరించిన భక్తులు శుక్రవారం తిరుమలకు తరలివెళ్లారు. దేవాలయాల పరిరక్షణ కమిటీ కన్వీనర్ బత్తల వెంకటరమణయ్య ఆధ్వర్యంలో 25 మంది భక్తులు కోడూరు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని 16వ వార్డు కోదండరామాపురంలో సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి గతంలో ఏ ప్రభుత్వం చేయలేదన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాలంటే మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కౌన్సిలర్లు ప్రమీలమ్మ, సత్యనారాయణరావు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



కొడవలూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈవీఎంలపై ప్రయోగాత్మకంగా ఓటర్లకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఎంఈఓ-2 ఎన్ అంకయ్య ఈవీఎంలో ఎంచుకున్న అభ్యర్థికి ఓటు ఎలా వేయాలో ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీ గున్నం మల్లికార్జున, ఏఎస్సై గంధం ప్రసాద్, ఆర్ఐ సునీల్, తదితరులు పాల్గొన్నారు.

కోదండరామావతారంలో రంగడు



నెల్లూరు(బృందావనం): పగల్‌పత్తు ఉత్సవాల్లో భాగంగా నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానంలో శుక్రవారం స్వామివారు కోదండరామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తగా అనుమాలశెట్టి నారాయణరావు వ్యవహరించారు.

విశేషాలంకారంలో వేణుగోపాలుడు



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవస్థానంలో స్వామివారు వైకుంఠనాథన్ అవతారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పేరూరు రాజ్యలక్ష్మి, సునీల్‌కుమార్ వ్యవహరించారు.

ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేయాలి

• డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి



బుచ్చిరెడ్డిపాళెంరూరల్:మాట్లాడుతున్న సాంబశివారెడ్డి

బుచ్చిరెడ్డిపాళెంరూరల్: ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఆర్డీ పీడీ సాంబశివారెడ్డి కోరారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రాపై శుక్రవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహిస్తోందని తెలిపారు. ఇప్పటికే అన్ని సచివాలయాలకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశామని తెలిపారు. క్రీడా పోటీల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతిఒక్కరూ పాల్గొనేలా చూడాలన్నారు. క్రీడలు నిర్వహించే క్రీడా ప్రాంగాణాల్లో అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ నరసింహారావు, తహసీల్దార్ సుధీర్, మండల ప్రత్యేక అధికారి సోమయ్య పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాకు ఐదు మైదానాలు

ముత్తుకూరు: ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఆడుదాం ఆంధ్రా పోటీలకు మండలంలో ఐదు మైదానాలను సిద్ధం చేయాలని డీపీఓ సుస్మితారెడ్డి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రాపై మండలాధికారులతో శుక్రవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల నిర్వహణకు ముత్తుకూరు, కృష్ణపట్నంపోర్టు, డమ్మాయపాళెం, ముసునూరువారిపాళెం, ఈపూరు వెంకనపాళెంలో క్రీడా మైదానాలు సిద్ధం చేయాలన్నారు. ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేసేందుకు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ నెల 17వ తేదీలోగా క్రీడాకారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేలా చూడాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేయాలని కోరారు. ఎంపీడీఓ లక్ష్మణకుమార్, ఈఓపీఆర్డీ హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.



ముత్తుకూరు:మాట్లాడుతున్న డీపీఓ సుస్మితారెడ్డి

త్వరలో సెంట్రల్ లైటింగ్ ప్రారంభం

• ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



సెంట్రల్ లైటింగ్‌ను పరిశీలించి సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

కొడవలూరు: నార్తురాజుపాలెంలో నూతనంగా నిర్మించిన సెంట్రల్ లైటింగ్‌తో పాటు వైఎస్సార్ కాంస్య విగ్రహాన్ని త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. నార్తురాజుపాళెంలో నూతనంగా నిర్మించిన సెంట్రల్ లైటింగ్, దివంగత సీఎం వైఎస్సార్ కాంస్య విగ్రహాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్తురాజుపాళెంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సెంట్రల్ లైటింగ్, వైఎస్సార్ కాంస్య విగ్రహ పనులు పూర్తవడంతో పరిశీలిస్తున్నామని తెలిపారు. త్వరలోనే రెండింటిని ప్రారంభిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే వెంట డీసీఎమ్మెస్, డీఏఏబీ చైర్మన్లు వీరి చలపతిరావు, దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం, వైఎస్సార్‌సీపీ నాయకులు అడపాల మోహనకృష్ణ, కొండా శ్రీనివాసులురెడ్డి, ఎం రంగారెడ్డి, ఎన్ మాణిక్యరావు, పీ మధుసూదన్‌రెడ్డి, బొచ్చు శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ



కొడవలూరులో: రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఉపసర్పంచ్ శైలజ



విడవలూరులో...

విడవలూరు: మండలంలో వరిణి రైతు భరోసా కేంద్రంలో రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలను శుక్రవారం పంపిణీ చేశారు. ప్రభుత్వం తుఫాన్‌తో నష్టపోయిన రైతులకు కేఎస్ఎం 1638 రకం వరి విత్తనాలను 80 శాతం సబ్సిడీపై అందజేసినట్లు జెడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య తెలిపారు. వరిణి సర్పంచ్ రావెళ్ల మల్లికార్జున, దండిగుంట సర్పంచ్ బెల్లంకొండ సుప్రజ, ఎంపీటీసీ ఎందేటి భక్తవత్సలం, వైఎస్సార్‌సీపీ నాయకులు మస్తానయ్య, వెంకయ్య, వీఏఏ పూజిత పాల్గొన్నారు.

కొడవలూరు: మండలంలోని కొత్తవంగల్లు ఆర్‌బీకేలో 80 శాతం రాయితీపై రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఉపసర్పంచ్ చక్కా శైలజ చేతుల మీదుగా రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏఓ లక్ష్మి మాట్లాడుతూ తుఫాన్‌తో నారుమళ్లు దెబ్బతిన్నందున రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీఏఏ సీహెచ్ వంశీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రభుత్వం చేయూత



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులురెడ్డి



బుచ్చిరెడ్డిపాళెంలో దివ్యాంగులకు బహుమతుల ప్రదానం

వెంకటాచలం: దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని విధాలా చేయూతనందిస్తోందని ఎంఈఓ శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. వెంకటాచలంలోని భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. దివ్యాంగులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందని తెలిపారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేకంగా పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఫిజియోథెరఫీ సేవలను అందిస్తుందన్నారు. ఈ సేవలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫిజియోథెరపిస్ట్ నాగరాజు, ఉపాధ్యాయులు అక్బర్, రవి, సైరా సుల్తానా, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: దివ్యాంగులను ప్రోత్సహించాలని ఎంపీడీఓ డీవీ నరసింహారావు అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ దివ్యాంగుల్లోని నైపుణ్యాలను వెలికితీయాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదేనన్నారు. దివ్యాంగులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.నీ కార్యక్రమంలో ఎంఈఓ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

చిన్నారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు



తోటపల్లిగూడూరు: అంగన్‌వాడీ సిబ్బంది నిరవధిక సమ్మెతో అంగన్‌వాడీ చిన్నారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. నరుకూరులోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది విధులకు గైర్హాజరైన నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులను తీసుకురావడం, భోజనం తయారు చేసి వడ్డించడం, తదితర కార్యక్రమాలను సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సహకారంతో చేపడుతున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఉడా కిశోర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో బీసీలకు సముచిత స్థానం



మనుబోలు: వైఎస్సార్‌సీపీలో బీసీలకు సముచిత స్థానం కల్పిస్తున్నారని జట్లకొండూరు ఉపసర్పంచ్ ఆవుల తులసీరాం పేర్కొన్నారు. వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైన సందర్భంగా శుక్రవారం ఆయన విజయవాడలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తులసీరాం మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బీసీలకు అధిక ప్రాధాన్యమిస్తూ వారి రాజకీయ ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు. గత పదేళ్లుగా కాకాణి వెంట నడుస్తూ పార్టీ అభివృద్ధికి పాటు పడుతున్నానని తెలిపారు.2024లో మారోసారి మంత్రి కాకాణిని ఎమ్మెల్యేగా గెలిపించునేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పొదలకూరు : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి బాటలు వేయాలని వైస్ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని ఇనుకుర్తి సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన ఏపీకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండల జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డితో కలిసి సచివాలయం వద్ద సంక్షేమ పథకాల లబ్ధి వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డు, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సర్పంచ్ పెదమల్లు శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ పులి వెంకటేశ్వర్లురెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, నాయకులు అక్కెం రామకోటారెడ్డి, ఎనిమిరెడ్డి పెంచలరెడ్డి, మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు గుర్తించాలి

పొదలకూరు : 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనులను గుర్తించాలని డ్వామా ఏపీడీ శ్రీహరిరెడ్డి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పొదలకూరు, కలువాయి, సైదాపురం, రాపూరు మండలాల టీఏలు, ఎఫ్ఏలకు శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పనులు కల్పించేందుకు పంచాయతీల వారీగా కొత్త పనులను గుర్తించి గ్రామసభల్లో ఆమోదం పొందాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సార్పీ సుధాకర్, జిల్లా రిసోర్స్‌పర్సన్ రాధిక, ఏపీఓ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

20 నుంచి ఆరోగ్యశ్రీపై అవగాహన



వైద్యారోగ్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ఇందుకూరుపేట: ఈ నెల 20 నుంచి గ్రామాల్లోని అన్ని గృహాలను వైద్యారోగ్య సిబ్బంది సందర్శించి వైఎస్సార్ ఆరోగ్యశ్రీపై అవగాహన కల్పించాలని జగదేవిపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు సీ కిషోర్, బ్రహ్మేశ్వరనాయుడు సూచించారు. శుక్రవారం జగదేవిపేట పీహెచ్‌సీలో వైద్యారోగ్య సిబ్బందికి ఆరోగ్య శ్రీ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచిందని తెలిపారు. ఎలాంటి ఆరోగ్య సమస్య ఎదురైనా, ప్రమాదానికి గురైనా ప్రజలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా అందించే సేవలను వివరించాలన్నారు. క్షయ వ్యాధిని పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు అడాల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. హెల్త్‌ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, సూపర్‌వైజర్లు రమ, సతీష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు నగదు సాయం



కేఆర్‌ఆర్ నగర్‌లో నగదు పంపిణీ చేస్తున్న నాయకులు



బుచ్చిరెడ్డిపాళెంలో బాధితురాలికి నగదు అందజేస్తున్న దృశ్యం

పొదలకూరు : మిచాంగ్ తుఫాన్‌తో నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వ నగదు సాయాన్ని శుక్రవారం పంపిణీ చేశారు. పట్టణంలోని కేఆర్‌ఆర్ నగర్‌లోని ఒక్కో కుటుంబానికి రూ.2,500 వంతున నగదు సాయం అందజేశారు. తొలుత బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, వార్డు సభ్యుడు ఎస్కే అంజాద్, తదితరులు పాల్గొన్నారు.

➡ కల్యాణపురంలోని గిరిజనులకు ఒక్కో కుటుంబానికి రూ.2,500 వంతున నగదు సాయం అందజేశారు. రెండ్రోజుల క్రితం నిత్యావసర సరకులను సైతం అందజేసినట్లుగా వీఆర్వో రామయ్య తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వెన్నపూస దయాకర్‌రెడ్డి, అక్కెం బుజ్జిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని 16వ వార్డుకు చెందిన మిచాంగ్ తుఫాన్ బాధితులకు ప్రభుత్వం శుక్రవారం నగదు సాయం అందజేసింది. తుఫాన్ ప్రభావంతో రెండు ఇళ్లు దెబ్బతినగా స్థానిక కౌన్సిలర్ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఒక్కో ఇంటికి రూ.10వేలు చొప్పున వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి అందజేశారు.

పాడి రైతులకు అండగా ప్రభుత్వం

• పశుసంవర్ధకశాఖ డీడీ నాగమణి



వెంకటాచలం: పశువుల దాణాను పంపిణీ చేస్తున్న డీడీ నాగమణి

వెంకటాచలం: తుఫాన్ కారణంగా ఇబ్బందులు పడిన పాడి రైతులకు ఉచితంగా పశుదాణాను పంపిణీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచిందని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగమణి పేర్కొన్నారు. వెంకటాచలంలోని పాడి రైతులకు ఉచిత పశుదాణాను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్ సహాయ చర్యల్లో భాగంగా ప్రభుత్వం పాడి రైతులకు బస్తా చొప్పున పశుదాణాను పంపిణీ చేస్తోందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య మాట్లాడుతూ తుఫాన్ బాధితులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలిచిందన్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తుఫాన్ బాధితులకు అన్ని విధాలా సహాయసహకారాలు అందించేలా ప్రత్యేక చర్యలు చేపట్టారని తెలిపారు. నారుమళ్లు దెబ్బతిన్న రైతులకు 80శాతం రాయితీపై విత్తనాలు, పునరావాస కేంద్రాల్లోని కుటుంబాలకు రూ.2,500 నగదు సాయం, నిత్యావసర సరుకులు అందజేసినట్లు వివరించారు. పశువైద్యాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పశు దాణామృతాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ముత్తుకూరు: తుఫాన్ సహాయ చర్యల్లో భాగంగా ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న సంపూర్ణ దాణామృతాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని వల్లూరు పశువైద్యాధికారి రాజ్యలక్ష్మి కోరారు. శుక్రవారం మల్లూరులో బైఫ్ సహకారంతో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. ముత్తుకూరు మండలానికి 24 టన్నుల దాణామృతం విడుదలైందని తెలిపారు. మల్లూరు పంచాయతీలో వేయి కిలోల దాణా పంపిణీ చేసినట్లు చెప్పారు. అనంతరం 23 పశువులకు చూడి నిర్ధారణ పరీక్షలు చేశారు. 34 దూడలకు నట్టల నివారణ మందు తాగించారు. 45 పశువులకు జలగ మందులు సరఫరా చేశారు. రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మనుబోలు: స్థానిక పశువైద్యశాలలో పాడి రైతులకు వైఎస్సార్‌సీపీ నాయకుల చేతుల మీదుగా ఏడీ గురవారెడ్డి ఉచిత పశుదాణాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీ గురవారెడ్డి మాట్లాడుతూ తుఫాన్ సహాయ చర్యల్లో భాగంగా ప్రభుత్వం మండలంలోని 83 మంది పాడి రైతులకు 23 టన్నుల పశుదాణాను ఉచితంగా పంపిణీ చేస్తోందని తెలిపారు. జెడ్పీటీసీ చిట్టమూరు అనితమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, చిట్టమూరు అజయ్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, ముంగర రవీంద్రరెడ్డి, అనమాల ప్రభాకర్‌రెడ్డి, కంచి మణి, రఫీ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు ఉచితంగా దాణా పంపిణీ

కొడవలూరు: యల్లాయపాళెం పశువైద్యశాల పరిధిలోని పాడి రైతులకు సంపూర్ణ దాణామృతాన్ని విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ నేపథ్యంలో పాడి పశువులు దాణాకు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం సంపూర్ణ దాణామృతాన్ని ఉచితంగా పంపిణీ చేస్తోందని తెలిపారు. పశువైద్యాధికారి జే సురేష్‌కుమార్, ఎంపీటీసీ కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మనుబోలులో..



కొడవలూరులో..



ముత్తుకూరులో మాట్లాడుతున్న వైద్యాధికారి రాజ్యలక్ష్మి

అమరజీవి త్యాగం వెలకట్టలేనిది



బుచ్చిరెడ్డిపాళెంలో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ సుప్రజ, తదితరులు



పొదలకూరులోని ప్రభుత్వ కళాశాలలో అమరజీవి, పటేల్‌కు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఆంధ్ర రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగం వెలకట్టలేనిదని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పేర్కొన్నారు. పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు లేకపోతే తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యేది కాదన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా నిరాహార దీక్ష చేపట్టిన అమరజీవిని భావితరాలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పుట్టా లక్ష్మీసుబ్రహ్మణ్యంనాయుడు, ప్రమీలమ్మ, లక్ష్మీకాంతమ్మ, సత్యనారాయణ, బాలనరసింహారావు, పెంచల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి

పొదలకూరు : అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు ఆదూరు వెంకటసుబ్బయ్య, రాచపూటి రామలింగయ్య, తన్నీరు సురేష్, ఆకులూరు హేమంత్, తన్నీరు సుందరరాజా తదితరులు పాల్గొన్నారు.

➡ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి, ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని శుక్రవారం నిర్వహించారు. అమరజీవి, పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగాం ఆఫీసర్, అధ్యాపకులు పాల్గొన్నారు.